ఐ యామ్ కలాం చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-పాడేరు: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం ఐ యామ్ కలాం చలనచిత్రాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే విధంగా చలనచిత్రాలను ఆశ్రమ పాఠశాలలో ప్రదర్శించి విద్యార్థులకు మాత్రమే వినోదాత్మకమైన చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఆదివారం శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐ యామ్ కలాం చలన చిత్రం ప్రదర్శించారు. విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. సెలవు రోజులలో విద్యార్థులు ఇళ్లకు వెళ్లకుండా ఐటీడీఏ అధికారులు ప్రయోగాత్మకంగా విజ్ఞానాన్ని అందించే విధంగా చలనచిత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

బూరిగ గ్రామంలో చెట్టు కింద చదువుతున్న విద్యార్థులు

చెట్లు, పాకల కిందే చదువులు..!

-తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
-పట్టించుకోని అధికారులు
-నూతన ప్రభుత్వం భవనాలు నిర్మించాలి

ప్రజాశక్తి - అనంతగిరి: మండలంలోని గిరిజన గ్రామాల్లో పాఠశాలల భవనాలు లేక చెట్లు, పాకల కింద చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. గత వైసిపి ప్రభుత్వం నాడు నేడు పథకంతో పాఠశాలల రూపు రేఖలు మార్చిన దాఖలాలు లేవు. మరీ నూతన ప్రభుత్వమైనా పాఠశాలల భవనాల నిర్మాణంపై దృష్టి పెడుతుందో లేదో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని వెంగడ పంచాయతీ డొంకపుటు ఎంపిపి ప్రాథమిక పాఠశాల పదేళ్ల నుండి మెండిగోడతో నిలిచి పోయింది. రెండు ఏళ్ళ కిందట ఐటిడిఎ నిదులతో పనులు చేపట్టి వదిలి వేశారు. ఈ పాఠశాలలో ఐదు గ్రామల విద్యార్థులు 55 మంది చదువుతున్నారు. వీరంతా పూరి పాకలో చదువుతున్నారు.బందవలసకు పాఠశాల నేటికి మంజూరు కాలేదు. మట్టి గోడ గదిలో 15 మంది విద్యార్థులు చదువుతున్నారు. వాలసీ పంచాయతీ పరిది ఊటగెడ్డ పాఠశాల మొండి గోడలతో నిలిచిపోయింది. ఇంటి ఆరు బయట చదువులు కొనసాగుతున్నాయి. పది మంది విద్యార్థులు ఉన్నారు. పైనంపాడు పంచాయతి కాకరపాడు పాఠశాల మొండి గోడలతో నిలిచింది. ఇక్కడా 36 మంది విద్యార్థులు పాకలో చదువులు సాగిస్తున్నారు.

వాలసి పంచాయతీ రాయిపాడులో పదేళ్ళ క్రితం పునాదులు తవ్వి వదిలి వేశారు. ఐదు గ్రామాలకు చెందిన 40 మంది పైగా విద్యార్థులు చిన్నపాటి వంటగదిలో చదువులు కొనసాగిస్తున్నారు. లుంగపర్తి పంచాయతీ ఓనుకొండ గ్రామంలో నేటికీ పాఠశాల మంజూరు కాలేదు. 20 మంది పైగా విద్యార్థులు ఇంటి అరుబయట చదువుతున్నారు. రొంపల్లి పంచాయతీ పరిధి బూరిగా గ్రామంలో మొండి గోడలతో పాఠశాల పనులు నిలిచిపోయాయి. 30 మందికి పైగా ఉన్నారు. వర్షాకాలంలో ఇంటి ఆరు బయట, ఎండాకాలం చెట్టు కింద చదువుతున్నారు. కివర్ల పంచాయతీ బుడ్డిగరువులో 30 మందిపైగా పివిటిజి విద్యార్థులు ఇంటి అరుబయట చదువుతున్నారు. నాడు నేడు నిధులు మంజూరుతో పునాది బేస్ మెంట్ పనులు చేపట్టారు. పూతికపుట్టు పాఠశాలలో నాడు నేడు నిధులు మంజూరు అయ్యాయి. పునాదులు తవ్వి వదిలివేశారు.చందాలు వేసుకుని పాకలను ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం పాఠశాలల ఏర్పాటుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

ఊటగెడ్డలో ఇంటి ఆవరణలో చదువుతున్న విద్యార్థులు

ఊటగెడ్డలో నిలిచిన పాఠశాల భవనం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

గ్రామాల్లో పాఠశాలలు మంజూరు చేయాలని అదికారులను కలిసి లిఖిత పూర్వకంగా విన్నవించినా స్పందించిన దాఖలాలు లేవు. దీంతో, విద్యార్థులు పాకలు, చెట్ల కింద అష్ట కష్టాలు పడి చదువుతున్నారు. ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వం స్పందించి పాఠశాలలను ఏర్పాటు చేయాలి

సివెరి కొండలరావు,
వేంగడ పంచాయతీ సిపిఎం మాజీ సర్పంచ్

ప్రమాదకరంగా ఉన్న రహదారి మార్గం

ప్రమాదభరితంగా అరుకు రహదారి

ప్రజాశక్తి- అనంతగిరి రూరల్: మండలంలోని చిలకలగెడ్డ మొదలుకొని అరుకు వెళ్లె ఘాట్ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ఘాట్ రోడ్డులో ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. గత మూడు రోజుల నుంచి కురిసిన భారీ వర్షానికి అరుకు రహదారి వర్షపు నీటితో నిండి పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో వర్షాకాలంలో రాత్రి వేళ ప్రయాణం చేయాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు.ఇదిలా ఉండగా వరద నీటి ప్రవాహానికి రోడ్డుకి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు కూలాయి. బీసుపురం- కాపీ తోట, టైడా జంగిల్ బెల్స్ ప్రాంతాల్లో రోడ్డు కోత కు గురైంది. ఓ వైపు హైవే నిర్మాణం జరుగుతుండటంతో ఎక్కడ పడితే అక్కడ గుంతలు చేస్తున్నారు. దీంతో, రహదారి మార్గం బురదమయంగా మారుతుదిం.దీంతో, వాహనదారులు పలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఘాట్ రోడ్‌లో ప్రమాదాలను అరికట్టాలని పలువురు వాహనదారులు, పలు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.



రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని కరిముఖి పుట్ పంచాయతీ కేంద్రంలోని ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్ భర్త గల్లెల అర్జున్ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. ఉద్యోగులు ముఖి బలరాం, ముఖి నరసింహ మూర్తిలను కరిముఖిపుట్ గ్రామ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానం చేశారు. వివిధ గ్రామాల నుంచి బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఇద్దరు ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఉద్యోగుల సేవలను కొనియాడారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతపల్లి : విద్యుత్ శాఖ అధికారులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో విద్యుత్ షాక్‌తో మరణాలు సంభవిస్తున్నాయి. జికెవీధి మండలం సిరిబాల గ్రామంలో ఈ నెల ఐదున విద్యుత్ స్తంభం నుండి షాక్ కు గురై కింద పడడంతో జోరంగి టైసన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువక ముందే చింతపల్లి మండలంలోని లంబసింగి పంచాయతీ చినరాజు పాకల గ్రామంలో జంగిల్ క్లియరెన్స్ చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురై రాజుబాబు అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటనలతో ఆ కుటుంబాలు నిరాశ్రయులుగా మిగిలారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు ఆ శాఖ అధికారులు కనీస జాగ్రత్తలు పాటించక పోవడంతో తరచూ ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటు న్నాయని పలువురు గిరిజనులు, పలు సంఘాల నేతలు తెలిపారు.

మన్యంలో భారీ వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- రాకపోకలకు అంతరాయం
- సోకులేరులో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

అల్పపీడన ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రాజవొమ్మంగి : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని మడేరు, ఒట్టిగడ్డ, కింద్ర పెద్దేరు, లబ్బర్తి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి, మండలంలో ఆదివారం కుండపోత వర్షం కురవడంతో గింజర్తి గ్రామ సమీపంలోని ఒట్టిగడ్డ వాగు ప్రధాన రహదారిపై సుమారు నాలుగు అడుగులు ఎత్తులో ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లిమెట్ల వాగు వద్ద కూడా వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో గంటల తరబడి రాకపోకలు ఆగిపోయాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఏటా వర్షాలు వస్తే ఇదే పరిస్థితి నెలకొంటున్న నేపథ్యంలో వాగులపై శాశ్వత వంతెనలు నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. వర్షాలు పుష్కలంగా కురుస్తున్న తరుణంలో రైతులు వ్యవసాయ పనులను ముమ్మరం చేస్తున్నారు.

దేవీపట్నంలో అత్యధిక వర్షపాతం నమోదు

రాజవొమ్మంగి : రంపచోడవరం నియోజకవర్గంలోని దేవీపట్నం మండలంలో గడిచిన 24 గంటల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. దేవీపట్నం మండలంలో 59.6 మిల్లీమీటర్లు, గంగవరంలో 52.8, అడ్డతీగలలో 50.2, చింతూరులో 41.2, రాజవొమ్మంగిలో 36.4, వై.రామవరంలో 31.4, కూనవరంలో 28.8, రంపచోడవరంలో 12.8, ఎటపాకలో 12.4, మారేడిమిల్లి మండలంలో 5.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఆదివారం వెల్లడించారు.

దుంబ్రిగుడలో పొంగి ప్రవహిస్తున్న గెడ్డ

సోకులేరు వాగులో యువకుడు గల్లంతు

మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సోకులేరు వాగు వ్యూ పాయింట్ వద్ద వాగులో పడి ఓ యువకుడు వ్యక్తి గల్లంతయ్యాడు. విజయవాడకు చెందిన ఇద్దరు స్నేహితులు మోతుగూడెం పరిధిలోని పర్యాటక ప్రదేశాలు సందర్శనకు వచ్చారు. సోకులేరు వాగు వద్ద ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులు వాగులో పడి వాగు ప్రవాహంలో కొట్టుకుపోతుంటే, ఇది గమనించిన స్థానికలు ఒక వ్యక్తినికి కాపాడారు. రెండో వ్యక్తి అల్లూరి తేజ (24) గల్లంతయ్యాడు. మోతుగూడెం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యుత్ తీగలపై కూలిన తాటిచెట్టు

రంపచోడవరం : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రంపచోడవరం పీఎంఆర్సి సమీపంలోని తాటిచెట్టు విరిగి విద్యుత్ లైన్‌పై పడడంతో ఆదివారం ఉదయం సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు పుటాహుటిన అక్కడికి చేరుకుని జెసిబి సహాయంతో ఈ చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేశారు.

వారపు సంతకు అంతరాయం

సీలేరు : జీకే విధి మండలం సీలేరులో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో సీలేరులో ఆదివారం వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుండి ఎవరూ రాలేని పరిస్థితి నెలకొంది. దుప్పిలివాడ పంచాయతీ పరిధి పిల్లి గెడ్డ, కాత్రగెడ్డ, చల్లని శిల్ప, జొన్న మామిడి తదితర గ్రామాల నుంచి గిరిజనులు రాకపోవడంతో వాలువ సంత కల తప్పింది. దుప్పిలి వాడకు చెందిన కొందరు మాత్రమే వారపు సంతకు అరకొరగా కూరగాయలు తీసుకొచ్చి విక్రయాలు జరిపారు. వర్షం, గిరిజనులు వారసంతకు రాకపోవడంతో వ్యాపారాలు సాగకపోవడంతో వర్తకులు నిరాశ గురయ్యారు. మరో వైపు కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి బత్తునూరు వద్ద వాగు పొంగి ప్రవహిస్తుంది.

ఏకధాటిగా వర్షాలు

దుంబ్రిగుడ : మండలంలో గత రెండు రోజులు గా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకదాటిగా వర్షాలు కురవడంతో మండలంలోని గిరిజనులు బయటకి రాలేని పరిస్థితి ఏర్పడింది.మండలంలోని సంపంగిపెద్ద, చంపాపట్టి, చాపరాయి, గోరాపూర్, కురిడి గెడ్డల ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. చాపరాయి జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది.జాతీయ రహదారి చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

పెదబయలు : పెదబయలులో ఏడతెరపి లేని వర్షాలు కురుస్తుండటంతో స్థానికులు ఇళ్ల నుండి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పెదబయలు గ్రంథాలయం ఇళ్ల ముందర వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. డ్రెయినేజి ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా సంబంధిత అధికారులు కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేసారు. అధికారులు డ్రెయినేజి మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు,

రాజవొమ్మంగి మండలం గింజర్తి వద్ద కల్వర్టు పై నుండి ప్రవహిస్తున్న వరద నీరు

వర్షాలకు..

నేలకూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం ఆసరాడ కాలనీలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదివారం ఎండిపోయిన కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం నేటి కూలిపోయింది. దీంతో ఆ కాలనీ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు విద్యుత్ లైన్‌మ్యాన్‌కు సమాచారం ఇవ్వగా ఆయన విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. కొబ్బరి చెట్టు విద్యుత్ తీగలపై పడిన సమయంలో ప్రజలెవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం, ప్రాణహాని తప్పింది. ట్రాన్స్‌కో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాన్ని, వైర్లను పునరుద్ధరించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

నేల కూలిన విద్యుత్ స్తంభం.. జాతీయ రహదారిపై వేలాడిన వైర్లు

సీలేరు : కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జీకే వీధి మండలం రింతాడ గ్రామంలో ఎన్‌హెచ్516 రహదారికి ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం ఆదివారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో ప్రజలు లేకపోవడం, ఆ స్తంభాలకు విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. పంచాయతీ ఉప సర్పంచ్ సోమేశ్ కుమార్, స్థానికులు సంఘటన ప్రదేశాన్ని పరిశీలించారు. నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినప్పుడు కాంక్రీట్ వేయకుండా తూతూ మంత్రంగా మట్టితో ఫిల్లింగ్ చేయడం వల్ల స్తంభం కూలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ట్రాన్స్‌కో, హైవే అధికారులు స్పందించి హైవే పక్కన ఆనుకొని ఉన్న స్తంభాలను కాంక్రీట్‌తో ఫీలింగ్ చేసి దృఢంగా ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వాగులపై శాశ్వత వంతెనలు నిర్మించాలి : లోతా రామారావు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని వాగులపై శాశ్వత వంతెనలు నిర్మించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాకాలం వచ్చిందంటే ఏజెన్సీలోని కొండవాగులు పొంగి ప్రవహిస్తుంటాయని, వంతెనలు లేకపోవడంతో ఈ వాగుల్లో వాహనాలతో సహా కొట్టుకుపోయి గల్లంతైన సందర్భాలు, వాగులో పడి ఎందరో గిరిజనులు ప్రతి ఏటా మృత్యువాత పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగిన సమయంలో చేతులు కాలేక ఆకులు పట్టుకున్నట్టు అధికారులు హడావుడి చేసి చేతులు దులిపేసుకుంటున్నారని, ఈ ప్రమాదాలను శాశ్వతంగా పరిష్కరించే మార్గాలు అన్వేషించడం లేదని విమర్శించారు. వాగులపై శాశ్వతంగా వంతెనల నిర్మాణం చేపట్టే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వరద నీరు ప్రమాదకరంగా ప్రవహించే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరారు. రంపచోడవరం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలకు మైదాన ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులు మారేడుమిల్లి -చింతూరు ఘాట్ రోడ్‌లోని వ్యూ పాయింట్లు వద్ద కొండ వాగుల్లో పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. అటువంటి ప్రదేశాలలో వాగుల్లో దిగడానికి లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఇటువంటి ప్రాంతాలను గుర్తించి శాశ్వత వంతెనలు నిర్మాణం చేయాలని, మారుమూల ప్రాంతాలకు రహదారి సౌకర్యాలు కల్పించాలని రామారావు డిమాండ్ చేశారు.

బత్తునూరు వాగుపై వంతెన నిర్మించాలి

గాలికొండ ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ పరిధి బత్తునూరు వాగుపై వంతెన నిర్మాణం చేయాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గాలికొండ పంచాయతీ పరిధిలోని బత్తునూరు, పాత్రుని గుంట, నేతమర్రి, బుగ్గిరాయి మైనకోట ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఈ వాగు దాటాలన్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బత్తునూరు వాగు ప్రమాదకరంగా పొంగి ప్రవహిస్తుందని, దానిపై వంతెన లేకపోవడంతో గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బత్తునూరు వంతెన నిర్మాణం చేపట్టాలని అధికారులకు అనేకసార్లు విన్నవించినా గిరిజనులు గోడు వినే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వాగు పొంగి ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందో, వాగులో ఎవరు కొట్టుకుపోతారో తెలియని దుస్థితి నెలకుందని వాపోయారు. బత్తునూరు నుంచి పాత్రుని గుంట, సప్తపాడు, నేతమర్రి బుగ్గరాయి, మైన కోట, పొట్ట కోట పెద్దలంక రేవులకోట మీదగా తూర్పు గోదావరి జిల్లా కలపడానికి సుమారు 25 కిలోమీటర్లు రహదారికి ప్రభుత్వం సర్వే చేసిందని, కాని ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ అది కార్యరూపం దాల్చలేదని విచారం వ్యక్తం చేశారు.

ప్రాణాలకు తెగించి విధుల నిర్వహణ

బత్తునూరు వాగు అవతల గ్రామాల్లో విధులకు పలు శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి వెళ్లాల్సి వస్తుందని బుజ్జిబాబు తెలిపారు. అంగన్వాడీ టీచర్ జర్త విజయలక్ష్మి తంబు వేయించేందుకు ఆదివారం ప్రమాదభరితంగా ప్రవహిస్తున్న బత్తునూరు వాగు దాటి సప్పర్ల వెళ్లి వచ్చారని, వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఏ క్షణంలో కొట్టుకుపోతానని తీవ్ర భయాందోళనకు ఆమె గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని కష్టాలకి గురవుతున్న గిరిజనులు సమస్యలు ప్రభుత్వ యంత్రాంగానికి ఎందుకు పట్టడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి బత్తునూరు వాగుపై వంతెన నిర్మించాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

బత్తునూరు వాగు దాటుతున్న అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి

సీలేరు నదిలో విరివిగా చిక్కుతున్న చేపలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే మండలం సీలేరు నదిలో మత్స్యకారుల వలలకు చేపలు విరివిగా చిక్కుతున్నాయి. సీలేరు, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో వారం రోజులు నుంచి వర్షాలు కురుస్తుండడంతో కొండ వాగుల నుంచి వ్యర్థాలతో కూడిన బురద నీరు సీలేరు నదిలో చేరుతుంది. నదిలో నీరంతా బురద రంగుగా మారడంతో చేపలు మత్స్యకారుల వలలుకు సునాయాసంగా చిక్కుతున్నాయి. ఆదివారం మత్స్యకారులకు రవ్వ, డోబి జాతికి చెందిన చేపలు అధికంగా లభ్యమయ్యాయి. వీటిని కిలో రూ.200 చొప్పున విక్రయించారు. సీలేరు నదిలో చేపలు మంచి రుచికరంగా ఉండడంతో వాటిని కొనుగోలు చేసేందుకు స్థానికులు ఎగబడ్డారు.

రోడ్డు విస్తరణ పనులతో బొర్రా గుహలకు పొంచి ఉన్న ప్రమాదం

మాజీ మంత్రి కిడారికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి -అనంతగిరి:కొత్తవలస-కిరోండాల్ కేకే లైన్ రెండవ రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు పెను ప్రమాదం పొంచి ఉందని, ఆ రోడ్డు మార్గాన్ని వేరే మార్గం ద్వారా ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి కిడారి ,శ్రావణ కుమార్‌కు బొర్రా గుహల ఉద్యోగులు కిల్లో సోమేష్, స్థానిక టిడిపి నేతలు రవి, టి.ఆనంద్, ప్రవీణ్, శ్యాములు వినతిపత్రాన్ని అందజేశారు. బొర్రా గుహలకు ఆనుకొని పైభాగం నుండి అదనంగా మరో రెండు లైన్ల రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయడంతో ఐరన్ హెవాల్ లోడులతో గూడ్స్, పాసింజర్ రైలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఇప్పటికే గుహల లోపలి భాగం కదిలిపోయి రాళ్ల పెచ్చులు ఊడి పడుతున్నాయని, దీంతో పర్యాటకులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు.రెండో రైల్వే మార్గం గుహల మీదుగా వేయవద్దని కోరారు స్పందించిన శ్రావణ్ మాట్లాడుతూ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు.

బాధితులకు నేటికీ అందని పరిహారం

ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ బాధితుల ఆత్మీయ సమావేశం

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌జి పాలిమర్స్ బాధితుల సంఘం నేతలు

ప్రజాశక్తి-వేపగుంట :ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఘటన జరిగి ఏళ్లు గడుస్తున్నా నేటికీ అనేకమంది బాధితులకు ప్రభుత్వపరంగా ఆదుకునే చర్యలు చేపట్టలేదని బాధితసంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం జివిఎంసి 94వ వార్డులోనిఒక ప్రైవేట్ కల్యాణ మండపంలో ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్‌లీకేజీ బాధితుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్‌లో నష్టపోయిన బాధితుల్లో నేటికీ అనేకమందికి నేటికీ పరిహారంగానీ, ఇతర ఆదుకునే చర్యలు చేపట్టలేదన్నారు. సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, ఆదుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ఎల్‌జి పాలిమర్స్ వద్ద రూ.120కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం సంకల్పించినట్లు వెలువడుతున్న వార్తలపై స్పష్టత కోరాలన్నారు. బాధితులు నాగరాజు మాట్లాడుతూ గ్యాస్‌లీకేజీలో బాధితుడినైనన తనకు ఎటువంటి పరిహారంగానీ, సాయంగానీ ఇవ్వలేదన్నారు. తనలాగే మిగిలిన బాధితులకు పరిహారంతోపాటు హెల్త్‌కార్డులు మంజూరు, ఇతర ప్రయోజనాలను చేకూర్చాలని కోరారు. మరోమారు ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించి, న్యాయం చేయాలని కోరాలన్నారు.సమావేశంలో అధిక సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు

సూపర్ సిక్స్ పథకాల అమలేదీ?

కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదని అరకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం ఆరోపించారు. ఆదివారం అరకులోయ మండల కేంద్రంలోని తన నివాస గృహంలో స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అమ్మ ఒడి, జగనన్న తోడు, కాపు నేస్తం, వైఎస్ఆర్ చేయూత వంటి పథకాలు ఇచ్చిన మాట ప్రకారం అమలు చేశారన్నారు. టీడీపి ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఇరవై లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఉద్యోగం లేకపోతే ప్రతీ నెల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం ప్రతి ఒక్కరికి 15 వేలు రూపాయలు ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదని చెప్పారు. తల్లికి వందనం పేరు మార్చి ఒక్కరికే ఇస్తామనట్లు ప్రచారం జరుగుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట ప్రకారం అమలు చేశారన్నారు.

కూటమి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయ లేదన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ జెడ్పిటిసి శెట్టి రోషిని, పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ పెటేల్లి సుస్మిత, వైసిపి మాజీ మండల అధ్యక్షుడు కొర్ర గాసి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కిల్లో రాజా రమేష్ బోస్, రామ్మూర్తి, వైసిపి నేతలు కమిడి అశోక్,తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టతనివ్వాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు తీరుపై కార్మికుల తీవ్ర అసంతృప్తి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టతనివ్వాలని కార్మిక సంఘ నేతలు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, యు.రామస్వామి, కెఎస్ఎన్.పిట్టారెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1249వ రోజు దీక్ష శిబిరంలో స్టీల్ వైఎస్ఆర్‌టియుసి నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఇటీవల స్టీల్‌ప్లాంట్ సందర్శను వచ్చిన కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి, విశాఖ స్టీల్‌ప్లాంట్ మూసేయబోమని ప్రకటించారే తప్ప, ప్రయివేటీకరింబోమని స్పష్టత ఇవ్వలేదన్నారు. ఇక మెడ్‌టెక్ జోన్ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసేందుకు ఉక్కు కార్మికసంఘాల నేతలు వెళితే, కనీసం వారికి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమని అసంతృప్తి వ్యక్తం చేశారు.విశాఖ ఉక్కుపై గందరగోళ ప్రకటనలు కాకుండా, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో మార్డుపూడి పరదేశి, కర్రి దళినాయుడు, నల్లమిల్లి శ్రీనివాస్‌రెడ్డి, బి రామకృష్ణ, దాసరి పుల్లారావు పిట్టా సంజీవ్‌రెడ్డి, ఎస్ భాస్కర్‌రాజు, గుమ్మడి నరేంద్ర కుమార్, బొజ్జ వెంకట్ రమణ, గొందేశి మంగరాజు, గెద్దాడ అప్పలకొండ, పి ఉగ్రం, బి రాజన్ రాజు, కాండ్రేగుల శ్రీను, వాసునాయుడు, కె శివ రామకృష్ణ పాల్గొన్నారు

దీక్షల్లో కూర్చున్న కార్మిక నేతలు, కార్మికులు

పెందుర్తిలో పోలీసుల కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు జెఎన్ఎన్ఆర్ఎం కాలనీలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి పెందుర్తి, గోపాలపట్నం పోలీస్‌స్టేషన్లకు చెందిన ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిచారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ ఎసిపి అన్నెపు నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పోలీస్ సిబ్బంది పరిశీలించారని, ఇళ్లల్లో సరైన ఆధారాలు లేని వారి వద్ద వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు చెందిన అన్ని వాహనాలకు సంబంధించి రికార్డులు, ఇతర పత్రాలను పరిశీలించారు. ఇటీవల కాలంలో నగరంలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం ఎక్కువైన నేపథ్యంలో దానిపైనే ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు చేపట్లారు. యువత తప్పుదోవ పట్టకుండా, ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌ను చక్క దిద్దుకోవాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని ఆదేశించారు మారువేషంలోనూ గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం సాగిస్తున్నారని సమాచారం ఉండడంతో తనిఖీలు నిరంతరం కొనసాగు తాయని పోలీసులు స్పష్టం చేశారు సిఐ రామకృష్ణ , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

మూగబోయిన బిఎస్ఎన్ఎల్ సేవలు

సిగ్నల్ లేక అవస్థలు పడుతున్న వినియోగదారులు

డుంబ్రిగుడలోని సెల్ టవర్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలో మూడు రోజులుగా బిఎస్ఎన్ఎల్ సేవలు మూగబోయాయి. తరచూ సేవలకు అంతరాయంతో వినియోగదారులు, ఇక్కట్లకు గురవుతున్నారు. నెలలో కనీసం రెండు వారాలు పూర్తిగా సేవలు నిలిచి పోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ముందుకు సాగలేదని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఆన్లైన్ సేవలు యూనియన్ బ్యాంకులు, బయట ఇంటర్నెట్ కేంద్రాల్లో కూడా సేవలు నిలిచి పోవడంతో నిర్వాహకులు పలు ఇబ్బందులు పడుతున్నారు.

మండల కేంద్రంలో సెల్, ఇంటర్నెట్ సౌకర్యానికి అంతరాయం ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలు పూర్తిస్థాయిలో కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

18 నుంచి జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -మధురవాడ : భీమిలి నియోజకవర్గం పరిధిలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల పేర్కొన్నారు. ఆదివారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 28 వరకు సభ్యత్వ నమోదు చేపట్టాలని అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారన్నారు. మూడు నెలల కిందటే పార్టీ క్రియాశీలక సభ్యత్వ గడువు ముగిసినప్పటికీ,. ఎన్నికల ప్రక్రియ మధ్యలో పార్టీ శ్రేణులను ఈ కార్యక్రమంతో గందరగోళపరచకూడదనే ఉద్దేశంతో మూడు నెలలపాటు వర్తించేలా క్రియాశీలక సభ్యుల రెన్యువల్ రుసుమును పవన్ కల్యాణే చెల్లించారన్నారు. ఇపుడు జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదుపై పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా విధివిధానాలను తెలియజేశారన్నారు. సభ్యత్వ నమోదు ప్రణాళికాబద్ధంగా చేపట్టి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బివి. కృష్ణయ్య, శాఖరి శ్రీనుబాబు, వార్డు అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందీ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో 9 రకాల హిందీపరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. హిందీ పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష ప్రవేశిక, రాష్ట్ర భాషా విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాషా విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాషా ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాషా ప్రవీణ ఉత్తరార్ధ ఉత్తీర్ణులైన వారికి మార్కుల జాబితాలు, సర్టిఫికెట్లను అందజేశారు ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు అధ్యక్షతన భీమిలిలో జరిగిన సమావేశంలో, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు పాల్గొని, సర్టిఫికెట్లను అందజేశారు.

మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశంకర్

ప్రజాశక్తి -ఆనందపురం: మానవ హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆనందపురం మండలం, లోడగలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన మామిడి ఉదయ్‌శంకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉదయశంకర్‌ను నియమిస్తూ, ఆంధ్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పబ్లిక్ రిలేషన్ విభాగానికి సంస్థ జాతీయ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, ఉత్తర్వులు జారీ చేశారు

. ఈ సందర్భంగా ఉదయశంకర్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్‌లో స్థానం కల్పించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కౌన్సిల్ జాతీయ చైర్మన్ షేక్ సిరాజుద్దీన్, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని తెలిపారు.

గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యాన జిఒ 54 ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 54ని గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను రంపచోడవరంలో ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రంపచోడవరం మండల అధ్యక్షులు సిహెచ్ సనాతనబాబు మాట్లాడుతూ 54 జీవో వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి వెంగళరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల సహ అధ్యక్షులు కె.సూరిబాబు, కార్యకర్తలు, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, కె వీరబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన, యాదవ సామాజిక తరగతికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌లను ఆదివారం సాయంత్రం సిరిపురంలోని గురజాడ కళా క్షేత్రంలో విశాఖపట్నం జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా మాజీ శాసన సభ స్పీకర్, టిడిపి నాయకులు యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. ఎన్‌టిఆర్ హయాంలో సేవా దృక్పథం ఉన్నవారికి ప్రాధాన్యత ఉండేదని, నేడు డబ్బున్న వారు మాత్రమే రాజకీయాల్లో రాణించగలుగుతున్నారని తెలిపారు. బలహీనవర్గాల వారు రాజకీయాలకు దూరమవుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు చట్టసభలలో ప్రాధాన్యం ఉండాలని తెలిపారు. విశాఖపట్నం జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఒమ్మి సన్యాసిరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ రాజాన రమణి, మాజీ ఎమ్మెల్యే పిన్నింటి వరలక్ష్మి, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, బరిణికాన రామారావు, మొల్లి లక్ష్మణరావు, బమ్మిడి రమణ, మంచి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో స్వచ్ఛతా వాక్‌థాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హెచ్‌పిసిఎల్ ఎల్‌పిజి మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పఖ్వాడా-2024 కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించారు. హెచ్‌పిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (స్పెషల్ ప్రాజెక్ట్స్) ఎన్.బాలదండయుతపాణి, డిజిఎం సేల్స్ సి.మురళీకృష్ణ, డిజిఎం రీజియన్ ప్రత్తి శ్రీనివాస్ నేతృత్వంలో ఈ కార్యక్రమం సాగింది. సుమారు 250 మందితో ఆర్‌కె బీచ్ కాళీమాత దేవాలయం వద్ద స్వచ్ఛతా సమావేశం నిర్వహించారు. అనంతరం బీచ్ క్లీనింగ్ చేపట్టారు.

వైజాగ్ వారియర్స్‌కు రూ.10 లక్షల నజరానా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా ప్రీమియర్ లీగ్ - 2024లో వైజాగ్ వారియర్స్ ఛాంపియన్స్ టైటిల్‌ను కైవశం చేసుకున్న నేపథ్యంలో ఆ జట్టుకు రూ.10 లక్షల నజరానా లభించింది. విశాఖపట్నంలోని ఎసిఎ-విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో వైజాగ్ వారియర్స్ ఉత్తరాంధ్ర లైయన్స్‌తో తలపడి అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైజాగ్ వారియర్స్ సహ-యజమాని, లైఫ్‌స్పాన్ యజమాని అయిన డాక్టర్ నరేంద్ర రామ్ జట్టుకు రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజాగ్ వారియర్స్ జట్టు సభ్యులకు, క్రీడా సిబ్బందికి, మీడియాకు, స్పాన్సర్లకు అభినందనలు తెలిపారు. విజేతగా నిలిచిన వైజాగ్ వారియర్స్ చరిత్ర సృష్టించిందని ఫ్రాంచైజీ యజమాని, పల్సస్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు సంతోషం వ్యక్తం చేశారు. తమ జట్టు ఆటగాళ్లు అద్భుత ప్రతిభతో రాణించారన్నారు. జాతీయ, అంతర్జాతీయ మ్యాచులు ఆడిన అనుభవం ఉన్న స్థానిక క్రికెటర్లు కెఎస్.భరత్, అశ్విని హెబ్బార్ వైజాగ్ వారియర్స్ విజయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వన్‌టౌన్‌లోని పోలీసు స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు

పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న సిపి శంఖబ్రత బాగ్చి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఉదయం వన్ టౌన్ లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను ఆయన అకస్మాత్తుగా సందర్శించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బంది ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్లు ఎల్లవేళలా అప్డేట్‌గా ఉండాలన్నారు. సిబ్బందికి కుటుంబ పరంగా, ఉద్యోగపరంగా, ఇతర ఏ సమస్యలు ఉన్నా తాము ఇచ్చిన 7995095799 నెంబరుకు తెలియజేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. వారి సమస్యలను సావధానంగా వినాలని, తగు విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆవరణలోగల సీజ్ చేయబడిన, వినియోగంలో లేని వాహనాలు పాడవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌లో పలు విభాగాలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది విధి నిర్వహణా తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సిపి స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉన్న పూర్ణా మార్కెట్ వంటి ప్రాంతాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. బ్లూకోట్స్, ట్రాకోట్స్ పని తీరు పరిశీలించారు. ట్రాఫిక్ అవగాహనా కార్యక్రమాలు నిత్యం చేపట్టాలని తెలిపారు, రోడ్డు ప్రమాదాల తగ్గుముఖానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించి, తగు ఆదేశాలు జారీచేశారు. ఫిషింగ్ హార్బర్, పోర్టు ప్రాంతాల్లో దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరగకుండా క్రైమ్ పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. సిసి కెమెరాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్స్ కదలికలపై నిఘా ఉంచాలన్నారు. విధులలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలపై దాడులు, అత్యాచారాల నివారణకు చర్యలు

ఎపి హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాదరావు

దుర్గాప్రసాదరావును సత్కరిస్తున్న మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాల్సి ఉందని, ఆ దిశగా మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు ప్రజలకు గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని ఎపి హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావు అన్నారు. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపైన ఫిర్యాదు చేసేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విశాఖ మానవ హక్కుల కౌన్సిల్ రజతోత్సవ వేడుకలు ఆదివారం ఓ హోటల్లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గడిచిన 25 ఏళ్లుగా కౌన్సిల్ ప్రజలకు విస్తృత సేవలందించడం ప్రశంసనీయమని కొనియాడారు. ఆర్థికంగా బలహీనపడిన, ఎటువంటి ఆసరా లేని మహిళలను లక్ష్యంగా చేసుకొని కొంతమంది దాడులు చేస్తున్నారన్నారు. మహిళల అక్రమ రవాణా, పైశాచికత్వానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో జాగురుకతతో వ్యవహరించాలని కోరారు. చట్టాలు, రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండేందుకు ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. మానవ అక్రమ నివారణపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం తొలి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ 1999లో మానవ హక్కుల కౌన్సిల్ స్థాపన జరిగిందన్నారు. త్వరలోనే కౌన్సిల్ ఆధ్వర్యంలో వాలంటీర్లను తయారు చేసి వారి ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మానహ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పదేళ్ల నుంచి పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సుమారు ఆరు వేల ఫిర్యాదులను జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, ఎయు డాక్టర్ అంబేద్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బెవరా సత్యనారాయణ, మాజీ జిల్లా న్యాయమూర్తి, పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్మన్ వరప్రసాదరావు, హ్యూమన్ రైట్ కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు ఎస్‌వి.రమణ, తెలంగాణ అధ్యక్షురాలు సుభాషిణి, సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి, వివిధ జిల్లాల కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మానవ హక్కుల అవగాహనపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని సరివేల గ్రామంలో రెండు సంవత్సరాల నుండి పాడైపోయి నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోరుకు ఆదివారం మరమ్మతులు చేశారు. ఈ బోరు పాడైపోవడంతో స్థానికులు తాగునీటికి తీవ్ర ఇబందులు పడుతున్నారు. ఈ సమస్యను జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు తీగల రవి దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ నేపథంలో ఆదివారం మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి ఉయిక వెంకటేష్, కార్యదర్శి ముచ్చిక సంతోష్, జనసేన కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కెనాల్‌లో పడిన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధి ఫార్బయ్ గ్రామం వద్ద ఉన్న పవర్ కెనాల్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు కాలుజారి పడిన యువకుడు మృతదేహం ఆదివారం ఫార్బయ్ రిజర్వాయర్‌లో లభ్యమైంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, చింతలూరు గ్రామానికి చెందిన మురళీకృష్ణ స్నేహితులతో కలిసి శుక్రవారం విహార యాత్రకు వచ్చాడు. ఫార్బయ్ గ్రామం వద్ద ఉన్న పవర్ కెనాల్‌లో ప్రమాదశాత్తు పడిపోయాడు. దీనిపై తోటి స్నేహితుల అదే రోజు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఆదివారం కెనాల్‌లో మృతదేహం కనిపించగా స్థానికులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలవరం నిర్వాసితుల ఆర్ఆర్ ప్యాకేజీపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : దేవీపట్నం మండలం, దేవీపట్నం గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితుడు ఉండమట్ల సీతారామయ్య (75 సంవత్సరాలు)కు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీపై 8 వారాల్లో చర్యలు తీసుకోవాలని జాతీయ మానవహక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు బాలు అక్కిస ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు రావలసిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ ఇవ్వడం లేదని సీతారామయ్య అనేకసార్లు అధికారులు చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. చివరకు విసుగు చెందిన ఆయన ఈ ఏడాది మే 24న ధవలేశ్వరంలోని పోలవరం పరిపాలనాధికారి కార్యాలయం ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేయగా రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందించారు. దీనిపై హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు బాలు అక్కిస న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కమిషన్ కేసు 1070/1/29/2024 నెంబర్‌తో కేసు నమోదు చేసి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్‌కు 8 వారాలలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీ చేసినట్లు బాలు అక్కిస తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం, సిరిగిందలపాడులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్యులు డాక్టర్ టివి.సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ పాల్గొని సుమారు 305 మందికి వైద్య సేవలు అందించారు. 81 మందికి రక్త పరీక్షలు, నలుగురికి థైరాయిడ్ పరీక్షలు, 13 మందికి ఎక్స్ రే, ఆరుగురికి ఫిజియథెరపీ చేశారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వారిచే కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 70 మందికి కంటి పరీక్షలు చేసి 28 మందికి కళ్లజోళ్లు అందించారు. జిబిఆర్ ఫౌండేషన్ ద్వారా ఫిట్స్ క్యాంప్ నిర్వహించారు.స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్, కానుమోను శ్రీనివాస్ పాల్గొన్నారు